సాక్షి తిరుపతి

శుక్రవారం । 7 । మార్చి । 2025



రేపటి నుంచి తుడా టవర్స్‌కి వేలం

తిరుపతి తుడా టవర్స్‌కి వేలం పాటకు అధికారులు సన్నద్ధమయ్యారు. శనివారం నుంచి వేలం పాట నిర్వహించనున్నారు. - 8లో



నేత..మేత

చిల్లకూరు మండలంలో సిమెంట్ రోడ్ల నిర్మాణం కూటమి నేతలకు కాసుల వర్షం కురిపిస్తున్నాయి. - 8లో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ శుక్రవారం (సా)	సహర్ శనివారం (ఉ)
తిరుపతి	6-25	5-06
గూడూరు	6-19	5-02

న్యూస్‌రీల్

డీవైఈఓ పరీక్షలను వాయిదా వేయండి



ఏపీపీఎస్సీ చైర్‌పర్సన్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఆపస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు

తిరుపతి ఎడ్యుకేషన్ : ఉప విద్యాశాఖాధికారి (డీవైఈఓ) పోస్టుల భర్తీకి ఈ నెల 26, 27 తేదీల్లో నిర్వహించనున్న ఏపీపీఎస్సీ పరీక్షలను వాయిదా వేయాలని ఆపస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.బాలాజీ, జీ.వెంకటసత్యనారాయ డిమాండ్ చేశారు. ఆ మేరకు గురువారం విజయవాడలో ఏపీపీఎస్సీ చైర్‌పర్సన్ ఏఆర్.అనురాధను కలిసి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ పదో తరగతి పబ్లిక్ పరీక్షలు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు పరీక్షలు నిర్వహించనున్న నేపథ్యంలో డీవైఈఓ పరీక్షలను వాయిదా వేయాలని ఆమెకు విజ్ఞప్తి చేశారు. దీనికి ఆమె సానుకూలంగా స్పందించారు. క్షేత్ర స్థాయి పరిస్థితులను సమీక్షించి నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు వారు ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలో గురువారం భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 8 కంపార్ట్‌మెంట్లు నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 63,285 మంది స్వామివారిని దర్శించుకున్నారు. దర్శన టిక్కెట్లు లేని వారికి 12 గంటల సమయం పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులు 3 గంటల్లో స్వామిని దర్శించుకోగలుగుతున్నారు.

రీసర్వే అంతేనా?

భూవివాదాలు పరిష్కారమే లక్ష్యంగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రీసర్వేకి శ్రీకారం చుట్టింది. దశలవారీగా ఎంపిక చేసిన పల్లెల్లో సర్వేను శరవేగంగా పూర్తి చేసింది. ఇంతలో సార్వత్రిక ఎన్నికల కోడ్ రావడంతో బ్రేక్ పడింది. తదనంతరం వచ్చిన కూటమి సర్కారు మళ్లీ రీసర్వే మొదలుపెట్టింది. పైలెట్ ప్రాజెక్టు కింద 33 గ్రామాలను ఎంపిక చేసింది. నాలుగు నెలల్లో మొత్తం ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించింది. అయితే క్షేత్ర స్థాయిలో సర్వే నత్తనడకన సాగుతోంది. ఇప్పటికి 50 రోజులు గడిచినా గ్రౌండ్ ట్రూత్ మాత్రమే పూర్తి చేయగలిగింది.



50 రోజులుగా నత్తనడకన రీసర్వే

- తొలి దశలో పైలెట్ ప్రాజెక్టు కింద 33 గ్రామాలు ఎంపిక
- 4 నెలల గడువులో 20 వేల ఎకరాల లక్ష్యం
- ఇప్పటి వరకు అంతంతమాత్రంగానే ప్రక్రియ

తిరుపతి అర్బన్ : బ్రిటీష్ పాలన తర్వాత భూముల రీసర్వే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో శ్రీకారం చుట్టారు. గత ఏడాది ఫిబ్రవరి చివరి వరకు సర్వే కొనసాగించారు. ఆ తర్వాత సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సర్వే ఆగిపోయింది. కూటమి సర్కార్‌లో మళ్లీ సర్వే ప్రారంభించారు. భూవివాదాలు అధికంగా ఉన్న గ్రామాలను ఎంపిక చేస్తే రీసర్వే తొలిదశలో గందగోళ పరిస్థితులు తలెత్తుతాయని అంచనా వేశారు. ఈ మేరకు ఎలాంటి వివాదాలు లేని పల్లెలను మాత్రమే పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేశారు. అందులో భాగంగా జిల్లాలోని 33 మండలాల్లోని 33 గ్రామాల పరిధిలో 20వేల ఎకరాల్లో రీసర్వేకు ఆదేశాలు జారీచేశారు. ప్రక్రియ పూర్తి చేసేందుకు నాలుగు నెలలు గడువు ఇచ్చారు. ఇప్పటికే సర్వే మొదలుపెట్టి 50 రోజులు గడుస్తోంది. అయితే ఇప్పటి వరకు ఆయా గ్రామాల్లో రైతులకు సర్వే కోసం నోటీసులు మాత్రమే ఇచ్చారు. తర్వాత సర్వే చేయడంతోపాటు సరిహద్దురాళ్ల ఏర్పాటు చేయడం, భూహక్కు పత్రాలు ఇవ్వాల్సి ఉంది. అయితే ఇందుకు 70 రోజులు మాత్రమే గడువు ఉండడం గమనార్హం.



రీసర్వేలో అధికారులు

జిల్లా సమాచారం

సర్వే గ్రామాలు	1,051
సర్వేయర్ల సంఖ్య	421
సర్వే చేయాల్సిన భూములు	15,40,351 ఎకరాలు
సర్వే చేసిన భూములు	1,71,371 ఎకరాలు
తొలి దశలో సర్వే పూర్తి చేసిన గ్రామాలు	74
రెండో దశలో	106
మూడో దశలో	140
నాల్గో దశలో సర్వేకి ఎంపికైన గ్రామాలు	731

సర్వే వేగవంతం చేయాలి



కూటమి ప్రభుత్వం మళ్లీ రిసర్వే ప్రక్రియ మొదలుపెట్టింది. అయితే ఈ సర్వేని పారదర్శకంగా నిర్వహించాలి. వేగవంతంగా చేపట్టాలి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో చేపట్టిన సర్వే గ్రామాలను మళ్లీ నిర్వహించడం మంచిది కాదు. – జగదీష్, రైతు మిట్టకండ్రిగ, వరదయ్యపాళ్యం మండలం

ముందుగా 33 గ్రామాల్లోనే..



ఈ ఏడాది జనవరి20వ తేదీ నుంచి రీసర్వే మొదలు పెట్టాం. ముందుగా 33 గ్రామాల్లో పైలెట్ ప్రాజెక్టు కింద సర్వే చేస్తున్నాం. ప్రభుత్వ ఆదేశాల మేరకే సర్వే చేపడతాం. గతంలో సర్వే చేసిన గ్రామాల్లో తిరిగి సర్వే ఉండదని భావిస్తున్నాం. అప్పట్లో చేయని గ్రామాల్లో మాత్రమే సర్వే ఉంటుంది. గతంలో ఉపయోగించిన డ్రోన్లనే వాడుకుంటాం. అవసరాలకు తగ్గట్టు సర్వేయర్లు ఉన్నారు. – అరుణ్‌కుమార్, జిల్లా సర్వే విభాగం అధికారి

షార్‌లో ఘనంగా సైన్స్ దినోత్సవం



సర్ సీవీ రామన్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న ముంబై ఐఐటీ ప్రొఫెసర్

సూళ్లూరుపేట: సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ (షార్) కేంద్రంలోని బ్రహ్మప్రకాష్ హాలులో గురువారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ముంబై ఐఐటీ ప్రొఫెసర్ కే సుబ్రమణ్యన్ విచ్చేశారు. ముందుగా సర్ సీవీ రామన్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన షార్ డైరెక్టర్ ఏ.రాజరాజన్ మాట్లాడుతూ భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ ప్రారంభించి అంచెలంచెలుగా ఎదిగిన తీరును వివరించారు. అనంతరం ప్రొఫెసర్ కే.రామసుబ్రమన్యన్ మాట్లాడుతూ 'దిలాస్ట్ ట్రెజర్ ఆఫ్ ఇండియన్ సైన్స్' అనే అంశం గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా షార్ ఇంజినీర్లుకు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ సైన్స్ ప్రాజెక్టులకు సంబంధించి ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. విద్యార్థులకు నిర్వహించిన పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. షార్ కంట్రోలర్ ఎం.శ్రీనివాసులురెడ్డి, షార్ ఉద్యోగస్తులు పాల్గొన్నారు.



షార్‌లోని బ్రహ్మప్రకాష్ హాల్లో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేస్తున్న ప్రొఫెసర్ కే.సుబ్రమణ్యన్

12న వైఎస్సార్‌సీపీ ఫీజు పోరు

- వేలాది మందితో కలెక్టరేట్ల వద్ద ధర్నా
- విద్యార్థుల సమస్యలపై నిరంతర పోరాటం
- జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి పిలుపు



ఫీజుపోరుపై వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నేతలతో సమావేశమైన జిల్లా అధ్యక్షుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి

తిరుపతి రూరల్: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు ఈనెల 12వ తేదీన జరిగే ×వైఎస్సార్‌సీపీ ఫీజు పోరు×ను విజయవంతం చేయాలని ఆ పార్టీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి పిలుపు నిచ్చారు. గురువారం చిత్తూరు, తిరుపతి జిల్లాల నుంచి వైఎస్సార్‌సీపీ పార్టీ విద్యార్థి విభాగం నియోజకవర్గాల అధ్యక్షులతో తుమ్మలగుంటలోని చంద్రగిరి నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో ఆయన సమావేశమయ్యారు. ఫీజు పోరు కార్యక్రమానికి అన్ని ప్రయివేటు విద్యాసంస్థల యజమాన్యాలు కూడా సహకరించాలన్నారు.

చిత్తూరు, తిరుపతి కలెక్టరేట్ల వద్ద నిరసన

వైఎస్సార్‌సీపీ ఫీజుపోరును చిత్తూరు, తిరుపతి కలెక్టర్ కార్యాలయాల వద్ద విద్యార్థులతో కలిసి పెద్ద ఎత్తున నిరసన చేపట్టనున్నట్టు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి తెలిపారు. చిత్తూరు కలెక్టర్ కార్యాలయం వద్ద కుప్పం, పలమనేరు, పుంగనూరు, పూతలపట్టు, జీడీ నెల్లూరు, చిత్తూరు నియోజకవర్గాల విద్యార్థులు, తిరుపతి కలెక్టరేట్ వద్ద సత్యవేడు, శ్రీకాళహస్తి, తిరుపతి, నగరి, చంద్రగిరి, వెంకటగిరి, సూళ్లూరుపేట నియోజకవర్గాల విద్యార్థులు నిరసన చేపట్టనున్న తెలిపారు. ఈ కార్యక్రమాలకు ఎంత మంది విద్యార్థులు రాగలరన్న సమాచారం ఈనెల 10వ తేదీకి సేకరించాలని సూచించారు. అనంతరం అన్ని నియోజకవర్గాల వైఎస్ఆర్ విద్యార్థి విభాగం నూతన అధ్యక్షులను శాలువలతో సత్కరించారు. రాష్ట్ర విద్యార్థి విభాగం నాయకులు ఓబుల్‌రెడ్డి,చిద్విలాసరెడ్డి, శశి, ఎస్‌వీ.సురేష్, పవన్‌కుమార్, డీ.లోకేష్, బీ.హరి, మహేష్, చెంగల్‌రెడ్డి, ప్రేమ్‌కుమార్, కుప్పిరెడ్డి భాస్కర్‌రెడ్డి, వినోద్, యుగంధర్, రాజశేఖర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, హరికుమార్ పాల్గొన్నారు.

ఓటేరు..ఆక్రమించేశారు!



తిరుపతి శివార్లలోని జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న ఓటేరు చెరువు మాయమవుతోంది. అధికారుల కళ్లెదుటే చెరువును పూడ్చివేస్తున్నా కనీసం అడ్డుకునే ప్రయత్నం కూడా చేయకపోవడం విమర్శలకు తావిస్తోంది. గురువారం సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు ఆధ్వర్యంలో నాయకులు చెరువును పరిశీలించారు. అనంతరం అక్కడే కొంతసేపు నిరసన చేపట్టారు. తన ఇంటి పక్కన చెరువును పూడ్చేస్తుంటే చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానికి తెలియ లేదా? అంటూ నిలదీశారు. ఆక్రమణలు ఆపకుంటే పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సీపీఎం నాయకులు బాలసుబ్రమణ్యం, టీ.సుబ్రమణ్యం, ఎస్.జయచంద్ర, కే.వేణుగోపాల్, పీ.హేమలత, కే.సుమన్, ఎం.నరేంద్ర, పీ.బుజ్జి, మునిరాజు, శేఖర్ పాల్గొన్నారు. – తిరుపతి రూరల్

కబ్జారాయుళ్లను అరెస్ట్ చేయాలి



తిరుపతి రూరల్ పరిధిలోని ఓటేరు చెరువు ఆక్రమణలను అడ్డుకోవాలంటూ సీపీఐ జిల్లా కార్యదర్శి పీ.మురళి డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం తిరుపతి ఆర్డీవో కార్యాలయం ఎదుట తిరుపతి నగర సమితి ఆధ్వర్యంలో నిరసన దీక్ష చేపట్టారు. విలువైన ఓటేరు చెరువును కొంతమంది కబ్జారాయుళ్లు పూడ్చేసి ఆక్రమించుకుంటున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. దీనిపై కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ స్పందిస్తూ ఓటేరు చెరువును యథావిధిగా ఉంచుతామని హామీ ఇచ్చారు. ఆర్డీవో సైతం స్పందిస్తూ చెరువులను ఆక్రమించిన వారిపై చర్యలుంటాయని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శివారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య, కే రాధాకృష్ణ, నగర కార్యదర్శి జే.విశ్వనాథ్, ఉదయ్ కుమార్, నగర కార్యవర్గ సభ్యులు ఎన్‌డీ.రవి తదితరులు పాల్గొన్నారు. – తిరుపతి అర్బన్

ఆత్మరక్షణకే సెల్ఫ్ డిఫెన్స్ శిక్షణ

తిరుపతి ఎడ్యుకేషన్ : బాలికల ఆత్మరక్షణ కోసమే పాఠశాలలో రాణీ లక్ష్మీబాయి ఆత్మరక్ష సెల్ఫ్ డిఫెన్స్ శిక్షణా కార్యక్రమాన్ని ప్రభుత్వం ఏర్పాటుచేసినట్లు డీఈఓ కేవీఎస్.కుమార్ తెలిపారు. తిరుపతిలోని డాక్టర్ ఎస్ఆర్‌కే నగరపాలక ఉన్నత పాఠశాలలో గురువారం ఈ కార్యక్రమాన్ని డీఈఓ ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు కలెక్టర్ అనుమతితో విజయవాడకు చెందిన రూపేష్ ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో జిల్లాలోని 475 ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో 6 నుంచి 9వ తరగతి చదివే 33,618 మంది బాలికలకు సెల్ఫ్ డిఫెన్స్ తరగతులను నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీవైఈఓ కె.బాలాజీ, డాక్టర్ రూపేష్‌బాబు, హెచ్ఎం కృష్ణకుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఈఓ కేవీఎస్.కుమార్

ఇంటర్ పరీక్షకు 943 మంది గైర్హాజరు

తిరుపతి ఎడ్యుకేషన్ : ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా గురువారం జిల్లా వ్యాప్తంగా 86 పరీక్షా కేంద్రాల్లో ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు ప్రథమ సంవత్సర విద్యార్థులకు మ్యాథ్స్-1ఏ, బోటనీ-1, సివిక్స్-1 సబ్జెక్టుల్లో పరీక్షను నిర్వహించారు. ఈ పరీక్షకు జనరల్‌లో 32,830 మంది, ఒకేషనల్‌లో 1,341 మంది మొత్తం 34,171మంది విద్యార్థులు హాజరవ్వాల్సి ఉంది. అయితే వీరిలో 943 మంది విద్యార్థులు గైర్హాజరైనట్టు ఆర్ఐఓ జీవీ.ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. కాగా శుక్రవారం ద్వితీయ సంవత్సర విద్యార్థులకు మ్యాథ్స్-2ఏ, బోటనీ-1, సివిక్స్-1 సబ్జెక్టుల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12గంటల వర కు జిల్లా వ్యాప్తంగా 86 పరీక్షా కేంద్రాల్లో పరీక్ష నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

శాస్త్రోక్తంగా శాంతి అభిషేకాలు



అభిషేకాలు నిర్వహిస్తున్న వేదపండితులు



పూజలు చేస్తున్న అర్చకులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు బుధవారం ఏకాంత సేవలో ముగిశాయి. గురువారం పంచమూర్తులు, పరివార దేవతలకు శాంతి అభిషేకాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. శ్రీకాళహస్తీశ్వరస్వామి, జ్ఞానప్రసూనాంబతో పాటు వినాయకస్వామి, శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యాస్వామి, చండికేశ్వరుడు, భక్తకన్నప్ప, త్రిశూలం, పరివార దేవతల ఉత్సవ మూర్తులకు వేదపండితులు అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. ఈవో బాపిరెడ్డి, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

రూ.5 కోట్ల భూమి హాంఫట్!

- జాతీయ రహదారి పక్కనే మూడు ఎకరాలు కబ్జా
- చదును చేసిన కూటమి నేతలు
- పట్టించుకోని రెవెన్యూ అధికారులు



జాతీయ రహదారి పక్కనే ఉన్న కాలువలకు మట్టి తోలి చదును చేసిన దృశ్యం

సాక్షి, టాస్క్‌ఫోర్స్ : చిల్లకూరు మండలంలోని చెన్నై- కలకత్తా జాతీయ రహదారి(ఎన్‌హెచ్-16) పక్కనే ముత్యాలపాడు రెవెన్యూ పరిధిలోని ప్రభుత్వ భూములపై కూటమి నేతల కన్నుపడింది. తలచిందే తడువుగా రూ.5 కోట్ల భూమిని ఆక్రమించేశారు. ఆపై యథేచ్ఛగా చదును చేసి స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత రెవెన్యూ అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడం విమర్శలకు తావిస్తోంది.

అంతా గోప్యం

ముత్యాలపాడు రెవెన్యూ పరిధిలోని రైటార సత్రంలోని ఓ హోటల్‌కు ఎదురుగా ఉన్న ప్రభుత్వ భూమిపై కన్నేసిన ప్రజాప్రతినిధి ఆ భూమిని దక్కించుకునేందుకు పావులు కదిపారు. రెవెన్యూ యంత్రాంగాన్ని తన గుప్పెట్లోకి తెచ్చుకుని అది పట్టాభూమి అని చెప్పించారు. అక్కడ ఉన్న ఒకే సర్వే నంబర్ ప్రకారం సుమారు 100 ఎకరాలకు పైగా భూములు ఉండగా.. ఇందులో ఎంత మేర సీలింగ్‌కు వదిలారు.. ఎంత మేర యజమానుల చేతిలో ఉన్నాయి అనే విషయాలను గోప్యంగా ఉంచారు. తనకు దగ్గరగా ఉండే ముత్యాలపాడుకు చెందిన నాయకుడిని సదరు ప్రజాప్రతినిధి రంగంలోకి దింపడంతో ఆయన రాత్రికి రాత్రే సుమారు వంద టిప్పర్ల మట్టిని తోలి చదును చేశారు.

బీజేపీ నాయకుడి ఫిర్యాదు

జాతీయ రహదారి పక్కనే విలువైన భూములు అన్యాక్రాంతం కావడంపై తిరుపతి జిల్లా బీజేపీ ఉపాధ్యక్షులు బైరప్ప కేంద్ర రహదారుల శాఖా మంత్రికి లికిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. అలాగే స్థానికంగా ఉండే సబ్ కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు అందించారు.

ఆ మూడు ఎకరాలకు స్కెచ్

పాత మద్రాసు హైవే రోడ్డుకు 50 మీటర్ల దూరంలో 2000 సంవత్సరంలో నేడు ఉన్న జాతీయ రహదారిని పడమర వైపు నిర్మించారు. ఈ రెండు రోడ్లకు మధ్యలో సుమారు మూడు ఎకరాల భూమి ఉంది. రహదారి నిర్మాణంలో భాగంగా రెండు రోడ్లకు మధ్యలో ఉన్న భూమిలో కాలువలు ఉండేవి. వర్షం వచ్చినప్పుడు రోడ్డుపై ప్రవహించే నీరు ఈ కాలువల ద్వారా ముత్యాలపాడు చెరువుకు చేరేది. ఈ రెండు రోడ్లకు మధ్యలో ఉన్న మూడు ఎకరాల భూమికి కూటమి నేతలు స్కెచ్ వేశారు. రాత్రికిరాత్రే ఆ భూమిలోని కాలువలను పూడ్చి చదును చేశారు.



వాడుకలో లేని పాత మద్రాస్‌రోడ్డు

అవి పట్టా భూములు

ముత్యాలపాడు రెవెన్యూ పరిధిలో రైటార్ సత్రం వద్ద జాతీయ రహదారి పక్కనే ఉన్న సుమారు మూడు ఎకరాల భూమిలో మట్టి తోలి చదును చేస్తున్న వారు ఎవరు అనే విషయం తెలియదు. అయితే ఈ భూములు పట్టా భూమి కావడంతో వాటిపై దృష్టి పెట్టలేదు. అయినా వీఆర్‌ఓను పంపి విచారణ చేయిస్తా. – శ్రీనివాసులు, తహసీల్దార్, చిల్లకూరు మండలం



తిరుపతి బులియన్

బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.88,780
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.8,026
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.99,300
రిటైల్ వెండి గ్రాము	రూ.102.30

నేత..మేత

ఉపాధి నిధులతో ఇష్టారాజ్యంగా సిమెంట్ రోడ్లు

- అనుమతి ఒకచోట.. నిర్మాణం మరో చోట
- కూటమి నేతల ఇళ్ల దగ్గరే రోడ్ల నిర్మాణం
- అయోమయంలో పేద జనం



తూర్పుకనుపూరులో రోడ్డు వేయల్సిన వీధి



కలకొండలో తాగునీటి బావి వద్దకు సీసీ రోడ్డు వేయల్సి ఉండగా ఇంకా మొదలు పెట్టని పనులు



తిక్కవరంలో ఎమ్మెల్యే శంకుస్థాన చేసిన ఇంకా ప్రారంభం కాని పనులు

చిల్లకూరు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ నిధులు కూటమి నేతలకు కల్పతరువుగా మారాయి. పల్లె పండుగ పేరుతో గ్రామాలలో ఇష్టారాజ్యంగా సిమెంట్ రోడ్లు నిర్మించి నిధులు బొక్కేశారు. ఒక గ్రామంలో రెండు పార్టీలకు చెందిన నేతలు ఉంటే వారికి సమానంగా అధికారులు పనులు అప్పగించారు. ఇంకా ముఖ్యమైన నేతలు ఉంటే అక్కడ నిధులు మరింతగా ఖర్చు చేసేలా పనులకు ఎస్టిమేషన్లు సిద్ధం చేశారు.

అను'మతి ఉందా'?

చాలా గ్రామాలలో అనుమతులు ఒక చోట.. పనులు చేసేది మరో చోటగా మారింది. తమకు నచ్చిన చోట, తమ ఇళ్ల దగ్గరకు ఉండేలా కూటమి నేతలు సీసీ రోడ్లు నిర్మించారు. కొన్ని గ్రామాల్లో రెండు నెలలు పూర్తి కావస్తున్నా ఇప్పటి వరకు సగం పనులు కూడా పూర్తిచేయలేదు. దళిత, గిరిజన కాలనీల్లో ఇంకా పనులు మొదలు పెట్టలేదు. సీసీ రోడ్డు పనులు ఆరంభించిన సమయంలో స్థానిక ప్రజాప్రతినిధి ఫొటో ఉన్న శిలాఫలకాలను ఆవిష్కరించి చేతులు దులుపుకున్నారు.

చిల్లకూరు మండలం వివరాలు	
సచివాలయాలు	17
పంచాయతీలు	30
గ్రామాలు	64
పనుల సంఖ్య	54
ప్రస్తుతం చేసిన పనులు	30
మంజూరైన నిధులు	రూ.2.73 కోట్లు
ఖర్చు చేసింది	రూ.1.5 కోట్లు
మొత్తం సీసీ రోడ్లు మీటర్లలో	6,396
పూర్తి చేసింది	3,690
పాత రోడ్డుపైనే రోడ్డు నిర్మాణం	1
నేతల ఇళ్ల వద్దకు వేసుకున్న రోడ్లు	3
ఇష్టానుసారంగా చేసిన పనులు	6
పనులు దక్కించుకున్న కూటమి నేతలు	45 మంది

చిల్లకూరు మండలంలో పరిస్థితి ఇదీ

- మండలంలోని ఓడూరు గ్రామంలో గత 20 ఏళ్ల క్రితం నిర్మించిన సీసీ రోడ్డుపైనే మళ్లీ సిమెంట్ రోడ్డు నిర్మించారు. గతంలో వేసిన రోడ్డు ఎత్తు తగ్గి పోవడమే కాకుండా అక్కడక్కడా పగిలి పోయిందన్న సాకుతో సీసీ రోడ్డును కొంత భాగం తొలగించి దాని స్థానంలో కొత్త రోడ్డు వేశారు. దీనిపై ఉపాధి, పీఆర్ అధికారులు ఎలాంటి అభ్యంతరం చెప్పలేదు.
- తీర ప్రాంతంలో ఉన్న తమ్మినపట్నం పంచాయతీలో మత్స్యకార కాలనీ అయిన కొత్తూరులో సీసీ రోడ్డు వేయాల్సి ఉండగా అక్కడ కాకుండా గ్రామంలో రోడ్డు వేస్తున్నట్లు ఎస్టిమేషన్లు మార్చి గ్రామంలోని నాయకుల ఇంటి ముందు సిమెంట్ రోడ్డు నిర్మించారు. నిబంధనలకు విరుద్ధంగా సీసీ రోడ్డు పూర్తిచేశారు.
- తీర ప్రాంతంలోని వేళ్లపాళెంలో సీసీ రోడ్ల నిర్మాణానికి స్థానిక ప్రజాప్రతినిధి శిలాఫలకం వేశారు. ఇక్కడ సీసీ రోడ్డు నిర్మాణంలో వాడాల్సిన ఇసుక బదులుగా ఈ ప్రాంతంలో లభించే సిలికాను వినియోగించారు. దీనిపై పీఆర్ ఏఈని వివరణ క్వారగా క్వాలిటీ కంట్రోల్ అధికారులు చూసుకుంటారని నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారు.
- తీర ప్రాంతంలోని మోమిడి గ్రామంలో రెండు సీసీ రోడ్లు నిర్మాణం చేపడితే ఇసుకకు ప్రత్యామ్నాయంగా అక్కడ దొరికే సిలికాను వాడారు. క్యూరింగ్ కూడా సక్రమంగా చేయలేదు.
- మండల తీర ప్రాంతలలోని తూర్పుకనుపూరు గ్రామంలో వేసిన సీసీ రోడ్లు ఒక వీధిలో వేయాల్సి ఉండగా తమకు అనుకూలమైన వారి ఇంటికి వెళ్లేలా అలైన్‌మెంట్ మార్చి రోడ్డు పనులు పూర్తి చేశారు. ఈ రోడ్డు వేసేందుకు స్థానిక నాయకులు ఆ ఇంటి యజమాని నుంచి కొంత మొత్తం వసూలు చేసుకున్నట్టు తెలుస్తోంది.
- దళిత, గిరిజనకాలనీల్లో ఇంకా సీసీరోడ్లు నిర్మించలేదు.



నాయకుల ఒత్తిడితో తమకు అనుకూలంగా ఉన్న వారి ఇంటి వద్దకు వేసిన రోడ్డు

నాణ్యతకు తిలోదకాలు

- తీర ప్రాంతంలోని పలు గ్రామాలలో ఇసుకకు బదులుగా సిలికాను వినియోగించారు. అధికారులు సూచించిన సిమెంటు కాకుండా మరో బ్రాండ్ సిమెంటును వినియోగించి పనులు పూర్తి చేశారు.
- కంకరలోనూ కక్కుర్తి పడి లోకల్‌లో దొరికే చిప్స్ వేసి రోడ్డు నిర్మాణం పూర్తిచేశారు.
- రోడ్డుకు అడుగు భాగంలో ప్లాస్టిక్ పట్ట వేయాలి. అలాగే రోడ్డు మధ్యలో పది అడుగులకు ఒక చోట బెర్ములు అమర్చాలి. కానీ వాటిని ఎక్కడా చేపట్టలేదు.
- రోడ్డు నిర్మాణం చేపట్టే సమయంలో ఆయా సచివాలయాలయాల ఇంజినిరింగ్ అసిస్టెంట్లు దగ్గరుండి పనిచేయించాలి. ఒకేసారి రెండు మూడు చోట్ల పనులు జరుగుతుండడంతో పూర్తి స్థాయిలో పర్యవేక్షణ చేయలేక పోయారు.



మోమిడి పంచాయతీ, గిరిజన కాలనీలో ఇసుకకు బదులు సిలికా వాడిన దృశ్యం



తమ్మినపట్నం పంచాయతీ మత్స్యకార కాలనీలో రోడ్డు దుస్థితి. ఇక్కడ వేయాల్సి రోడ్డును ఓ నేత ఇంటి వద్దకు వేసుకున్నారు



తీర ప్రాంతంలోని తమ్మినపట్నంలో ఓ నేత ఇంటి వద్దకు వేసుకున్న సీసీ రోడ్డు



తమ్మినపట్నంలో సన్నగా రోడ్డు వేసి చేతులు దులుపుకున్న నాయకులు

చట్టాలపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు

తిరుపతి క్రైం : పోలీసు ఉద్యోగంలో విధులను సమర్థవంతంగా నిర్వహించాలని ప్రొబెషనరీ సబ్ ఇన్‌స్పెక్టర్లకు ఎస్పీ హర్షవర్ధన్ రాజు దిశానిర్దేశించారు. గురువారం పోలీస్ అతిథి గృహంలో 39 మంది ప్రొబెషనరీ సబ్ ఇన్‌స్పెక్టర్లతో ఆయన సమావేశమయ్యారు. సమాజంలో పోలీస్ పాత్ర చాలా విలువైనదని చెప్పారు. నిరంతరం పోలీసులను ప్రజలు గమనిస్తూనే ఉంటారని తెలిపారు. ప్రతి ఒక్కరూ చట్టాలపై పూర్తి స్థాయిలో అవగాహన తెచ్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ట్రైనీ ఐపీఎస్ అధికారి హేమంత్‌పాల్గొన్నారు.

రేపటి నుంచి తుడా టవర్స్‌కి వేలం

తిరుపతి తుడా: తిరుపతి నగరంలోని అన్నమయ్య కూడలి వద్ద తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ నిర్మిస్తున్న తుడా టవర్స్ ప్లాట్లకు శనివారం నుంచి వేలం నిర్వహించనున్నట్టు ఉపాధ్యక్షులు ఎస్.మౌర్య తెలిపారు. నిర్మాణంలో ఉన్న తుడా టవర్స్‌ని గురువారం ఆమె ఇంజినీరింగ్ అధికారులతో పరిశీలించారు. వేలం నిర్వహణపై తుడా కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. రాయలచెరువు రోడ్డులో తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ ప్రజలందరికీ అందుబాటులో ఉండేలా 3.6 ఎకరాలలో తుడా టవర్స్‌ను నిర్మిస్తున్నట్టు తెలిపారు. ఇందులో గ్రౌండ్ ఫ్లోర్‌తో పాటు 13 అంతస్తులలో తుడా టవర్స్ నిర్మాణం జరుగుతోందని, గ్రౌండ్, ఒకటవ అంతస్తుల్లో 27 దుకాణాలతో వాణిజ్య సముదాయాలు, రెండు, మూడు, నాలుగు అంతస్తుల్లో ఆఫీస్‌ల వినియోగానికి, మిగిలిన అంతస్తుల్లో నివాస యోగ్యంగా 2, 3, 4 బెడ్ రూమ్ ఫ్లాట్స్ నిర్మిస్తున్నామని తెలిపారు. నివసించేందుకు 230 ప్లాట్లు ఉంటాయని, అందులో 46 డబుల్ బెడ్ రూమ్స్, 152 ట్రిబుల్ బెడ్ రూమ్స్, 32 నాలుగు బెడ్ రూమ్స్ ఫ్లాట్స్ ఉంటాయని చెప్పారు. శనివారం 2, 3 అంతస్తులకు, 9వ తేదీ 4,5, అంతస్తులకు, 10వ తేదీ 6, 7 అంతస్తులకు, 11న 8,9 అంతస్తులకు, 12న 10, 11 అంతస్తులకు ఉదయం 10 నుంచి 1 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 గంటల వరకు వేలం నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో కార్యదర్శి వెంకటనారాయణ, సూపరింటెండెంట్ ఇంజినీర్ కృష్ణారెడ్డి, ఈఈ రవీంద్ర ఉన్నారు.

క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీలో నియామకం



జ్ఞానజగదీష్

చిత్తూరు కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఆ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నియామకం చేపట్టారు. మొదలియార్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా చిత్తూరు సంతపేటకు చెందిన జ్ఞాన జగదీష్‌ను నియమించినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటించింది. ఈ మేరకు గురువారం ఆయనకు ఉత్తర్వులు అందాయి.

అంతర్జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్ పోటీలకు ఎంపిక



అంతర్జాతీయ పోటీలకు ఎంపికైన భరత్ మహీపతి

చిట్టమూరు : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా పని చేస్తున్న పిడుగు భరత్ మహీపతి ప్రపంచ స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం మీనా కుమారి గురువారం తెలిపారు. ఈనెల 4 నుంచి బెంగళూరులోని కంఠీరవ అథ్లెటిక్ స్టేడియంలో జరిగిన 43వ జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్ పోటీలలో పాల్గొని హ్యామర్ త్రో విభాగంలో వెండి పతకం సాధించినట్టు వెల్లడించారు. అలాగే మేలో ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్‌లో జరిగే ప్రపంచ స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్ పోటీలలో భారత దేశం తరఫున పాల్గొననున్నట్టు వివరించారు. భరత్ మహీపతిని ఉపాధ్యాయులు, ప్రజలు అభినందించారు.

జాతీయ సైన్స్ వారోత్సవాల్లో ప్రతిభ



హుస్నాను అభినందిస్తున్న అధికారులు

శ్రీకాళహస్తి: తిరుపతిలోని ఎస్వీయూ క్యాంపస్ పాఠశాలలో గురువారం జిల్లా స్థాయి, జాతీయ స్థాయి సైన్స్ వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ ముగింపు కార్యక్రమంలో శ్రీకాళహస్తి పట్టణంలోని కుమారస్వామి తిప్ప వద్దనున్న మునిసిపల్ ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న విద్యార్థిని షేక్ హుస్నా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో 'మీకు నచ్చిన శాస్త్రవేత్త' అనే అంశంపై వ్యాసం రాసిన షేక్ హుస్నా, జిల్లా స్థాయిలో మొదటి బహుమతి గెలుపొందారు. ముఖ్యఅతిథులుగా విచ్చేసిన గాదంకిలోని యస్ఏఆర్‌యల్ డైరెక్టర్ పాత్రో, డీఈఓ కుమార్, ఏఎంఓ, జిల్లా సైన్స్ అధికారి భానుప్రసాద్‌లు విద్యార్థినిని అభినందించి ప్రశంసాపత్రాన్ని అందజేశారు. కుమారస్వామి తిప్ప పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు షేక్ నౌజియా పాల్గొన్నారు.

అభ్యంతరాలు తెలియజేయండి



సబ్ కలెక్టర్‌కు అభ్యంతరాలు తెలియజేస్తున్న లింగవరం యువకులు

చిల్లకూరు: క్రిస్ సిటీకి సేకరించిన భూములకు సంబంధించిన పరిహారం చెల్లింపుల్లో ఏవైనా అభ్యంతరాలు ఉంటే రాత పూర్వకంగా వారంలోగా అందజేయాలని భూములు కోల్పోయిన సాగుదారులకు గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీన సూచించారు. మండల తీర ప్రాంతంలోని తమ్మినపట్నం రెవెన్యూ పరిధిలో సుమారుగా 914 ఎకరాలను తొలి విడతలో క్రిస్ సిటీ కోసం సేకరించారు. ఈ భూములకు పరిహారం అందించడంలో పలు మార్లు నిర్వహించిన గ్రామ సభల్లో విషయం కొలిక్కి రాలేదు. దీంతో ఇటీవల ప్రభుత్వం పరిహారాన్ని రూ.8 లక్షలు చెల్లించేలా ప్రకటించడంతో సాగదారులు కూడా దీనికి అంగీకరించారు. ఈ క్రమంలో సాగుదారుల జాబితాను సిద్ధం చేసి దానిని ఆయా సచివాలయాల్లో ఉంచే క్రమంలో తీగపాళెం వద్ద సాగుదారులతో సమావేశం నిర్వహించారు. సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ సేకరించిన 914 ఎకరాలలో 617 ఎకరాలలో సాగు ఉన్నట్లు తెలిపారు. మిగిలిన భూమి బీడుగా ఉందని, ఇందులో 617 ఎకరాలకు గాను ఎకరాకు రూ.8 లక్షల చొప్పున పరిహారం అందించేలా ఆదేశాలు అందాయ తెలిపారు. సమావేశంలో తహసీల్దార్ శ్రీనివాసులు, ఆర్ఐ పూర్ణ, తమ్మినపట్నం, లింగవరం సర్పంచ్‌లు నెల్లిపూడి సుబ్రహ్మణ్యం, నాశిన సుబ్రహ్మణ్యం, వరగలి ఎంపీటీసీ దారా కోటేశ్వరరావు, రూరల్ సీఐ కిశోర్‌బాబు, ఎస్ఐ సురేష్‌బాబు పాల్గొన్నారు.

ఐదు కిలోల గంజాయి స్వాధీనం

తిరుపతి క్రైమ్: నగరంలో అక్రమంగా గంజాయి విక్రయిస్తున్న ఒక వ్యక్తిని అరెస్ట్ చేసి ఐదు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్న ఘటన గురువారం చోటుచేసుకుంది. ఈస్ట్ సీఐ రామకృష్ణ తెలిపిన వివరాల మేరకు.. తిరుపతి ఎస్టీవీ నగర్‌కు చెందిన అరవింద(22) గంజాయి అక్రమ రవాణా కేసులో ఇప్పటికే అన్నవరంలో ముద్దాయిగా ఉన్నాడు. ఇతనికి ఒడిశా రాష్ట్రం, చిత్రకొండ కు చెందిన గణేష్‌ను అన్నవరంలో పరిచయం చేసుకున్నాడు. ఇతని వద్ద లక్ష రూపాయలు ఇచ్చి ఐదుకిలోల గంజాయిని కొనుగోలు చేసి తిరుపతి ఆర్టీసీ బస్టాండ్‌కి తీసుకొచ్చాడు. అయితే రాహస్య సమాచారం మేరకు అతన్ని అరెస్ట్ చేసి అతని వద్ద ఉన్న ఐదు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు పోలీసులు తెలిపారు. గంజాయిని చిన్న చిన్న పొట్లాలుగా చేసుకొని ఒక్కొక్కటి రూ.300 చొప్పున విక్రయిస్తున్నట్లు విచారణలో తేలిందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ పేర్కొన్నారు.

ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగల అరెస్టు



మాట్లాడుతున్న డీఎస్పీ నరసింహమూర్తి



పోలీసులు స్వాధీనం చేసుకున్న బంగారు నగలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో మహిళ మెడలో బంగారు గొలుసు చోరీ ఘటనలో ఇద్దరు దొంగలను పోలీసులు అరెస్టు చేశారు. గురువారం 1వ పట్టణ పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ నరసింహమూర్తి విలేకరుల సమావేశం నిర్వహించారు. 1వ పట్టణ సీఐ గోపి, క్రైమ్ పార్టీ పోలీసులు ఈ కేసును దర్యాప్తు చేపట్టారన్నారు. వారం రోజుల్లోనే కేసును ఛేదించి ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగలను అరెస్టు చేసినట్టు వెల్లడించారు. తమిళనాడు మేలుమలైకి చెందిన మీనా(29), తిరుచ్చి జిల్లా సమయపురానికి చెందిన పొన్నుమణి అక్కచెల్లెళ్లు. వీరు సంతల్లో, బస్సుల్లో జనాలు రద్దీగా ఉన్న ప్రాంతాల్లో హ్యాండ్‌బ్యాగులు, పర్సులు దొంగలిస్తుంటారని తెలిపారు. వీరిపై తమిళనాడులో ఆరు కేసులు ఉన్నట్టు పేర్కొన్నారు. జైలు నుంచి బయలకు రాగా లాయరు ఖర్చు నిమిత్తం దొంగతనం చేసేందుకు శ్రీకాళహస్తి బ్రహ్మోత్సవాలను ఎంచుకున్నట్టు తెలిపారు. రథోత్సవం రోజున భక్తులతో కలిసిపోయి తోపులాట జరిగినపుడు మహిళల మెడలో బంగారు గొలుసులను అపహరించినట్టు వెల్లడించారు. వీరు పట్టణంలోని నెహ్రూవీధిలోని సుదర్శన్ ల్యాబ్, తేరువీధిలోని కోమల రెసిడెన్సీ, నగరి వీధిలోని వినాయకస్వామి ఆలయం, సునీల్ నగల దుకాణం ముందు, తేరువీధిలోని నంది హోటల్, పెండ్లి మండపం వద్ద మహిళల మెడల్లో నుంచి బంగారు గొలుసులను అపహరించినట్టు తెలిపారు. వీరిని గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు చెప్పారు. కేసును ఛేదించిన వారిని ఎస్పీ అభినందించి రివార్డులను ప్రకటించినట్టు పేర్కొన్నారు. సీఐ గోపి పాల్గొన్నారు.

కల్తీ నెయ్యి కేసులో ముగిసిన కస్టడీ

తిరుపతి లీగల్: తిరుమలకు కల్తీ నెయ్యి తరలిస్తున్నారన్న అభియోగాల కింద నమోదైన కేసులో ఇద్దరికి మూడు రోజుల కస్టడీ గురువారంతో ముగిసింది. దీంతో కేసులో మూడవ నిందితుడిగా అభియోగాలు ఎదుర్కొంటున్న వైష్ణవి డెయిరీ డైరెక్టర్ విపిల్ జైన్, 5వ నిందితుడిగా అభియోగాలు ఎదుర్కొంటున్న వైష్ణవి డెయిరీ సీఈఓ అపూర్వ వినయకాంత్ చావడాలను మూడు రోజులపాటు పోలీసు కస్టడీకి ఇస్తూ తిరుపతి రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోటేశ్వరరావు సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. దీంతో పోలీసులు వారిని జుడిషియల్ కస్టడీ నుంచి తమ కస్టడీకి తీసుకుని విచారించారు. గురువారంతో కస్టడీ కాలం ముగియడంతో పోలీసులు ఇద్దరినీ తిరిగి కోర్టులో హాజరుపరిచారు. న్యాయమూర్తి ఇద్దరినీ తిరిగి జ్యుడీషియల్ కస్టడీకి తరలిస్తూ ఆదేశాలు జారీచేశారు. కేసులో నిందితులుగా అభియోగాలు ఎదుర్కొంటున్న నలుగురు దాఖలు చేసుకున్న బెయిల్ పిటిషన్‌లపై సోమవారం వాదనలు జరగనున్నట్లు తెలిసింది.

ఉరేసుకుని వృద్ధురాలి మృతి

రేణిగుంట(శ్రీకాళహస్తి రూరల్): మామిడి చెట్టుకు ఉరేసుకుని వృద్ధురాలు మృతిచెందిన ఘటన రేణిగుంట మండలం, వెదుళ్లచెరువు ఎస్టీ కాలనీలో గురువారం చోటు చేసుకుంది. కాలనీకి చెందిన గురవయ్య భార్య సరస్వతి(75) వెదుళ్లచెరువు ఎస్టీ కాలనీలోని తన చిన్న కుమార్తె యశోద ఇంటి వద్ద ఉంటోంది. ఆమెకు మానసిక పరిస్థితి సరిగా లేదు. అయితే గురువారం ఉదయం యశోద, ఆమె కుమారుడు ఆవుల దినకర్ కలసి గంగిరెడ్డిపల్లిలోని బంధువుల ఊళ్లో కర్మక్రియలకు వెళ్లారు. ఈ క్రమంలో 11గంటల సమయంలో ఎస్టీ కాలనీలోని వారు ఫోన్ చేసి సరస్వతి మామిడి చెట్టుకు ఉరి వేసుకుని మృతి చెందిందినట్టు సమాచారం అందించారు. ఎవరికీ భారం కాకూడదని భావించి మామిడి చెట్టు కొమ్మకి చీరతో ఉరి వేసుకొని మృతి చెందినట్లు పోలీసులు భావిస్తున్నారు. రేణిగుంట అర్బన్ ఎస్ఐ అరుణ్‌కుమార్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దళారీ అరెస్ట్


తిరుమల : టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు ఫొటోలను వాట్సాప్ డీపీగా పెట్టుకుని, చైర్మన్ పీఆర్వో అని నమ్మిస్తూ శ్రీవారి సేవా, దర్శన టికెట్లు ఇప్పిస్తామని మోసగిస్తున్న ఘరానా మోసగాడిని తిరుమల టూటౌన్ పీఎస్ పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. టూటౌన్ పీఎస్ సీఐ శ్రీరాముడు తెలిపిన వివరాల మేరకు.. చంద్రగిరికి చెందిన ఫరూక్ అలియాస్ ప్రసాద్(35) ప్రస్తుతం శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, కోవూరులో నివాసం ఉంటున్నాడు. ఇతను గత నాలుగు నెలల నుంచి 'తిరుమల సమాచారం' అనే వాట్సాప్ గ్రూప్‌ను క్రియేట్ చేసి అందులో సుమారు 600 మందిని సభ్యులుగా చేర్చి తిరుమలలో శ్రీవారి దర్శనం కావాలంటే తనను సంప్రదించండి అని మేసేజ్‌లు రాసి పోస్ట్ చేసేవాడు. దాన్ని నమ్మిన గ్రూప్‌లోని భక్తులు అతన్ని వాట్సాప్ కాల్ ద్వారా కాంటాక్ట్ అవుతారు. దీంతో నిందితుడు వారికి దర్శనం ఇప్పిస్తామని చెప్పి వారి వద్ద నుంచి ఫోన్ పే ద్వారా నగదు వేయించుకుని మోసగించేవాడు. ఈ విధంగా సుమారు రూ.80వేలు తీసుకుని మోసగించాడు. నిందితుడిపై చంద్రగిరి పోలీస్ స్టేషన్‌లో మూడు కేసులు ఉండగా ఇందులో మూడు నెలలు జైలు శిక్షను సైతం అనుభవించాడు. పోలీసులు చాకచక్యంగా ప్రసాద్‌ను అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి సెల్‌ఫోన్, ఆరు సిమ్ కార్డులు, బ్యాంక్ పాసు పుస్తకాలు స్వాధీనం చేసుకున్నారు.

దళారులను నమ్మి మోసపోకండి

భక్తులు ఎట్టి పరిస్థితుల్లోనూ దళారులు నమ్మి మోసపోవద్దని సీఐ శ్రీరాముడు సూచించారు. ఎవరైనా దళారులను గుర్తిస్తే వారి వివరాలను తీసుకుని తిరుమల పోలీసులను 0877–2289027లో సంప్రదించాలని సూచించారు.

అమ్మానాన్నా.. వెళ్లిపోయారా?

విధి ఆడిన వింత నాటకంలో ఆ కుటుంబం చిన్నాభిన్నమైంది. భార్య, చిన్నకుమార్తెతో కలిసి బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి వస్తుండగా మృత్యువు రూపంలో ఆటో దూసుకొచ్చింది. ఈ ప్రమాదంలో తన కళ్లెదుటే తల్లిదండ్రులు కన్నుమూయడం ఆ బాలిక మనసును కలచివేసింది. తన గాయాలు లెక్కచేయక అమ్మా..నాన్నా..! మాట్లాడండి నాన్నా..? అంటూ రోదించిన తీరు చూపరులను కంటతడి పెట్టించింది. మరో బాలిక ఆస్పత్రికి చేరుకుని చికిత్స పొందుతున్న చెల్లిని, విగత జీవులుగా పడి ఉన్న తల్లిదండ్రులను చూసి గుండెలు బాదుకున్న తీరు అక్కడి వారిని కంటతడి పెట్టించింది.



ప్రమాదానికి కారణమైన ఆటో



నుజ్జునుజ్జయిన స్కూటీ



మృతి చెందిన జ్యోతి(ఫైల్)



మునెయ్య (ఫైల్)

సైదాపురం-తిప్పవరపాడులో ఘోర ప్రమాదం

- స్కూటీని ఢీకొట్టిన ఆటో
- తల్లిదండ్రులు మృతి
- అనాథలైన ఇద్దరు కుమార్తెలు
- సైదాపురంలో విషాద ఛాయలు

సైదాపురం/గూడూరు రూరల్: 'అమ్మా..నాన్నా మమ్మల్ని వదిలి వెళ్లిపోయారా..!' అంటూ తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్న కుమార్తె, ఆమె అక్క రోదించడం స్థానికంగా కలచివేసింది. సైదాపురం – తిప్పవరపాడులో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తల్లిదండ్రులు మృతి చెందగా.. చిన్న కుమార్తె తీవ్ర గాయాలతో ఆస్పత్రిపాలైన ఘటన తీవ్ర విషాదాన్ని నింపింది. స్థానికులు, గూడూరు రూరల్ పోలీసుల వివరాల మేరకు.. శ్రీపొట్టిశ్రీరాముల నెల్లూరు జిల్లా, సైదాపురానికి చెందిన దొడ్డగ మునెయ్య బట్టల దుకాణం నడుపుకుంటున్నారు. భార్య జ్యోతి టైలరింగ్ చేస్తూ కుటుంబానికి ఆదరువుగా ఉండేది. ఈ క్రమంలో వారికి నిహారిక, వైష్ణవి ఇద్దరు ఆడ బిడ్డలు ఉన్నారు. వారు స్థానిక పాఠశాలల్లో 8, 7 తరగతులు చదువుకుంటున్నారు. మునెయ్య బంధువులు కోట మండలంలోని విద్యానగర్‌లో ఉండడంతో వారి వద్దకు వెళ్లేందుకు భార్య జ్యోతి, చిన్న కుమార్తె వైష్ణవిని తీసుకుని స్కూటీపై వెళ్లి తిరిగి ఇంటికి వస్తున్నారు. ఈ క్రమంలో సైదాపురం నుంచి గూడూరు వైపు వస్తున్న ఆటో స్కూటీని ఢీకొట్టి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో మునెయ్య, జ్యోతిలిద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. వైష్ణవికి తీవ్ర గాయాలు కావడంతో గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. తల్లిదండ్రులు కళ్లెదుటే దుర్మరణం చెందడంతో బాలిక షాక్‌కు గురైంది. అమ్మా..నాన్న వెళ్లి పోయారా..అంటూ కన్నీటిపర్యంతమవడం స్థానికులను కలచివేసింది.